ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రశాంత్ అన్నారు. సోమవారం జీపు జాత పట్టణానికి చేరకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో నాసిరకమైన భోజనం అందజేస్తున్నారన్నారు. ఉడకని అన్నం, నీళ్ల రసం, మురిగిన గుడ్డు అందిస్తున్నారని ఆరోపించారు. కొన్ని ప్రాంతాలలో కాలం తీరిపోయిన చిక్కీలు అందజేస్తున్నారన్నారు. నాసిరకం ఆహారం తిని విద్యార్థులు అనారోగ్యానికి గురవుతూ కడుపు నొప్పితో బాధపడుతూ ఆసుపత్రి పాలవుతున్నారన్నారు. నాసిరకమైన విద్యాకానుక వలన బడి సంచి, యూనిఫామ్ కొంతకాలానికే చినిగిపోతున్నాయని అన్నారు. కొన్ని పాఠశాలలో నాడు-నేడు పనులు పూర్తయినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు వినియోగంలోకి రాక తాళాలు వేసి ఉన్నారని, మెయింటెనెన్స్ కు డబ్బులు లేదని సాకులు చెప్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు జీపు జాత బృందం నాయకులు హరి, వీరాంజనేయులు, వంశీ, చంద్ర, చరణ్ పాల్గొన్నారు.

విశాఖ 'ఉక్కు' ప్రయివేటీకరణను ఆపాలి : 'సిటు'

న్యూస్ క్లిక్‌పై నమోదైన ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణంలోని అంబేద్కర్ చిత్ర పటం వద్ద విశాఖ ఉక్కును ప్రవేటికరించరాదని కోరుతూ పోరాటం మొదలుపెట్టి 1000 రోజులు పూర్తి అవుతున్న సందర్భంగా అలాగే న్యూస్ క్లిక్ యజమాని ప్రభీర్ పురకాయస్త, అడ్మినిస్ట్రేట్ మేనేజర్ అభిజిత్ చక్రవర్తిని అరెస్టు చేయడాన్ని ప్రజాతంత్ర వాదులు అందరూ ఖండించాలని, వారిని వెంటనే విడుదల చేయాలని ఎఫ్ఐఆర్ కాపీలను దగ్ధం చేశారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మీడియా రంగంపై ఆంక్షలు పెరిగిపోయాయని విమర్శించారు న్యూస్ క్లిక్ ప్రతినిధులు, 16 మంది పాత్రికేయులపై ఉపా చట్టం కింద కేసులు బనాయించారని ఇది తీవ్రమైన అన్యాయం అని అన్నారు. దేశంలో మీడియా స్వేచ్ఛ మరింత దిగజారిందని తెలియజేశారు. న్యూస్ క్లిక్‌కు విదేశాల నుండి ఆర్థికంగా సహాయమందుతుందనే పేరుతో వారిని అరెస్టు చేశారని తెలిపారు. రాబోవు కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కక్ష సాధింపులకు వ్యతిరేకంగా నిర్వహించే ప్రజా ఉద్యమాలలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటుకరించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని టిడిపి, వైసిపి విశాఖ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసి ఉంటే కేంద్రం వెనక్కి తగ్గేదన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వంతో చట్టపట్టాల్ వేసుకొని ముందుకు సాగకుండా తెగతెంపులు చేసుకోవాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వెయ్యి రోజులే కాదని ఇంకా రెండు వేల రోజులైనా పోరాడుతామని వారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చెన్నయ్య, రాంబాబు, మాధవయ్య, వెంకటరమణ, రైతులు నరసింహులు, శంకరయ్య, తిరుపతయ్య, జకరయ్యతో పాటు వ్యవసాయ కార్మికులు మంగమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెఫరెల్ కేసులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ గిరీష పి.ఎస్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం, వై. ఏపి నీడ్స్ జగన్ అంశాలపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్లోని మినీ విసి హాల్ నుంచి కలెక్టరు గిరీష పి. ఎస్, డిఆర్ఓ సత్యనారాయణ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద రెఫరెల్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన జగనన్న సురక్ష ఆరోగ్య కేంద్రాలను బాగా నిర్వహించారని ఇంకను సజావుగా చేపట్టాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో జిజిహెచ్, ఎంపానల్ అయిన ఆసుపత్రులకు రెఫరెల్స్ చేసిన కేసులను దగ్గరుండి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించి, మందులను ఉచితంగా అందించడం, ప్రభుత్వ ఆరోగ్య ఆసరా అందించడం చేయాలన్నారు. రెఫరెల్స్ కేసులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని, ఆసుపత్రులకు వెళ్లిన వారికి నాణ్యత కలిగిన చికిత్స అందిస్తున్నారా లేదా అనేది పరిశీలించాలన్నారు. ఎలాంటి రాజీ లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రెఫరెల్స్ కేసులపై డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, జిల్లా ఆరోగ్య శ్రీ కో-ఆర్డినేటర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రభుత్వ మెడకల్ కళాశాల ప్రిన్సిపల్ లు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ కె.కొండయ్య డిసిహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

అర్జీలపై సానుకూలంగా స్పందించాలి : జెసి

ప్రజాశక్తి -రాయచోటి

జగనన్నకు చెబుదాం స్పందన అర్జీలపై సానుకూలంగా స్పందిస్తూ నిర్దేశిత గడువులోగా సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్‌తో పాటు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, డిఆర్ఓ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఎడి జయరాజ్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఎన్నో ప్రయాసలకు కోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా ప్రధాన కేంద్రాలకు వస్తుంటారని అధికారులు ప్రజల సమస్యలు గుర్తించి వెంటనే పరిష్క రించాలన్నారు. ప్రతి అధికారి స్పందన ద్వారా స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా చదివి అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పరిష్కార నివేదిక పంపాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఎలోని దరఖాస్తులన్నింటినీ వేగంగా గడువులోగా పరిష్కరించి ఏ ఒక్క దరఖాస్తు కూడా బియాండ్ ఎస్-ఎల్ఎలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జెసి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పిడి శివయ్య, ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సిఎం జగన్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9న రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లును ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, డిఎస్‌పి మహబూబ్ బాష, ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులుతో కలసి పరిశీలించారు. శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకీయా ఖానం కుమారుని వివాహ రిసెప్షన్ రాయచోటి పట్టణంలోని అభి కల్యాణ మండపంలోనూ, మాసాపేటకు చెందిన కీ శే జిఎండి రఫీ సోదరుని కుమార్తె వివాహం పట్టణంలోని రాజధాని కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. వివాహ కార్యక్రమాలకు సిఎం జగన్ హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియచేయనున్నారు. ఈ సందర్భంగా పర్యటనా ఏర్పాట్లును శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. రాజధాని కల్యాణ మండపం వెనుక భాగంలోనే ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణాల పనులును, హెలిప్యాడ్ నుంచి కల్యాణ మండపాలకు వెళ్లే రహదారుల మరమ్మతు పనులపై అధికారులతో చర్చించారు. అధికారుల సమన్వయంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ఎలాంటి పొరబాట్లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, వైఎస్ఆర్‌సిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, ఆర్అండ్‌బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకట సుబ్బయ్య, అసిస్టెంట్ ఇంజినీరు గిరీశ్వర రావు, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, కౌన్సిలర్లు ఆసీఫ్ అలీఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, షబ్బీర్, జానం రవీంద్ర యాదవ్,నాసీర్, బిసి సెల్ విజయ భాస్కర్, జిఎండి ఇమ్రాన్, ఇర్షాద్, కో-ఆప్షన్ హజరత్ ఖాదర్ వలీ, ఆర్ట్స్ శంకర్, నవాజ్ క్రిష్ పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

10 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నవంబర్ పదో తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు జెవివి గౌరవాధ్యక్షులు టి.హరీంద్రనాథ్ శర్మ తెలిపారు. సోమవారం స్థానిక జ్ఞానోదయ హై స్కూల్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం నవంబర్ 10 నుండి జన విజ్ఞాన వేదిక - చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రారంభం అవుతుందని, నాలుగు దశలలో జరిగే ఈ టాలెంట్ టెస్ట్కి ఎనిమిది, తొమ్మిది, పదవ తరగతి చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, పరిసరాల అవగాహన పెంపొందించే దిశలో నిర్వహించే ఈ ప్రతిభా పరీక్షను అందరూ విద్యార్థుల చేత రాయించే బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తీసుకోవాలని సూచించారు. నవంబర్ 10న పాఠశాల స్థాయి, నవంబర్ 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 27, 28న రాష్ట్ర స్థాయి టెస్టులు నిర్వహించడం జరుగితుందని తెలిపారు. ప్రతి సంవత్సరం సహకరించినట్లుగానే సహకరించి జన విజ్ఞాన వేదిక కృషికి చేయుతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి ఎన్. చంద్ర, తారక రామా నాయుడు, జ్ఞానోదయ కరస్పాండెంట్ కామకోటి ప్రసాద్ రావు, శాఖ గ్రంథాలయ అధికారిని వసంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

హామీలే తప్ప ఆచరణ శూన్యం : 'గంటా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి పాలనలో ఉత్తుత్తి హామీలే తప్ప వాటి ఆచరణ శూన్యమని టిడిపి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు పక్కా గృహాలు కట్టిస్తామన్న వైసిపి ప్రభుత్వం ఎన్నికలు దగ్గర పడుతున్నా ఇళ్ల మాత్రం అసంపూర్తిగానే ఉన్నాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానంలో ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఆరోపించారు. సోమవారం పట్టణ శివారు ప్రాంతంలోని బ్రాహ్మణపల్లి సమీపంలో ఉన్న జగనన్న కాలనీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చేందుకు అనేక హామీలతో, నవరత్నాల పేరుతో అధికారంలోకి వచ్చారన్నారు. పేదలకు ప్రభుత్వమే ఇంటి గృహాలు నిర్వహిస్తామని మాట ఇచ్చి తప్పారన్నారు. ఎలాంటి మౌలిక వసతులు లేకుండానే కాలనీలను పేదలకు ఇచ్చారని, ఇప్పటికీ ఆ గృహాలు 30 శాతం మాత్రమే పనులు పూర్తి అయ్యాయన్నారు. హామీలు ఇవ్వడమే తప్ప సిం జగన్‌కు వాటిని నెరవేర్చే బాధ్యత లేదన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదల ఇండ్లు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి పాలనను రాష్ట్ర ప్రజలు క్షుణ్ణంగా గమనించారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య, బిసి నాయకుడు శ్రీరాములు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీని పరిశీలిస్తున్న గంటా నరహరి

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

పదవ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం పేర్కొన్నారు. సోమవారం స్థానిక డైట్ విద్యా కేంద్రాన్ని తనిఖీ చేశారు. తరగతి గదులలో ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. సిలబస్ ఎంతవరకు పూర్తయిందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి మొదటి మెట్టు అన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా క్రమశిక్షణతో, పట్టుదలతో బాగా చదవాలన్నారు. మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం డైట్ కేంద్రంలో నిర్వహిస్తున్న లిప్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, జిల్లా అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధానో పాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం

సంక్షేమమే ప్రభుత్వ అజెండా :'చింతల'

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి గడపకు సంక్షేమాన్ని అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అజెండా అని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం వాల్మీకిపురం పంచాయతీ ఫత్తేపురం, శివపురం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆయా కుటుంబాలకు చేరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను, కుతంత్రాలను ప్రజలే తిప్పికొట్టి పేదలకు మంచి చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దాదాపు పూర్తిస్థాయిలో నెరవేర్చిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని, గతంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజల్ని మోసం చేశారన్నారు. మళ్లీ మోసపూరిత హామీలతో కిచిడి మేనిఫెస్టోను చంద్రబాబు ప్రకటించారని, చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు యధాతథంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేదల సంక్షేమం, రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా ప్రజలు సీఎం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచి ఆదరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఫిరోజ్‌ఖాన్, ఈవో ఉదయ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, విఆర్ఒ సుధాకర్, నాయకులు చింతల ఆనందరెడ్డి, మదనమోహన్‌రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవరెడ్డి, రాయుడు, ఆనంద, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక దీక్షలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని ఒకటి, రెండు వార్డులలో మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట జనసేన పార్టీ రాష్ట్ర సమితి కార్యదర్శి డాక్టర్ మైఫోర్స్ మహేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని బి.కె.పల్లి, అనుపగుట్ట, చంద్ర కాలనీ, మంజునాథ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాలైన తాగునీరు, మురుగునీటి కాలువలు, రోడ్లు,వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు.జనం కోసమే జనసేన పాదయాత్రలో ప్రజలు మహేష్ దృష్టికి అనేక సమస్యలు తీసుకురావడంతో వాటిపై స్పందించి ఐదు నెలలుగా సబ్ కలెక్టర్,మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్, వివిధ ప్రభుత్వ అధికారులను కలిసి సమస్యలపై ఎన్నో విధాలుగా పోరాటాలు చేశామని పేర్కొన్నారు. రిలే నిరాహార దీక్షల సమయంలో మున్సిపల్ అధికారులు స్పందించి రూ.2.85 కోట్ల అంచనాతో రెండు నెలలలోపు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి నేటికీ ఐదు నెలలు కావస్తున్నా ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. దీనిపై మున్సిపల్ కార్యాలయం ఎదుట వార్డుల ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా ఒకటవ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని మహేష్, జనసేన నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషనుకి తరలించారు. మహేష్ స్పందిస్తూ ఒకటి రెండు వార్డులను సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 20వ తేదీ నుంచి మున్సిపల్ కార్యాలయం ముందు నిరవధిక నిరాహార దీక్షకు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శోభా, సునీత, ప్రవీణ్, అప్పుర్సిమి, రమణ, లక్ష్మి, దేవేంద్ర, దాములు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

బోగస్ ఓట్లు తొలగించాలని ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో వందలకొద్ది బయటపడుతున్న బోగస్ ఓట్లను తొలగింపునకు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం నాయకులు నాగూర్ వలి, వేమయ్య, ప్రసాద్, పూలకుంట్ల హరిబాబు, బాలు, నాగమణి ఈశ్వరి ఆర్‌డిఒ ఎం.ఎస్.మురళికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాలో ప్రజలు మార్పులు, చేర్పులు చేసుకునే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ 4, 5వ తేదీల్లో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసిందన్నారు. మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషాతో కలిసి తాము పలు ప్రాంతాల్లోని ఓటర్ల జాబితాలను పరిశీలించామన్నారు. ఎన్‌విఆర్ లేఔట్‌లోని ఓ వ్యక్తి ఇంట్లో 40 ఓట్లు ఉండగా గుర్తించామని తెలిపారు. వాటిని బిఎల్ఒలు సరిచేసిన పిమ్మట ఇంకా 28 ఓట్లు ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. పట్టణంలో ఇదే తరహాలో అనేక అక్రమ ఓట్లు ఉన్నాయన్నారు. అక్రమ ఓట్లు ప్రజాస్వామ్యానికి మంచిది కాదనీ, వీటిని సత్వరమే తొలగించి పకడ్బందీ ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని ఆర్‌డిఒ విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆర్‌డిఒ స్పందిస్తూ ఓటర్ జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి అక్రమ ఓట్లను తొలగిస్తామని హామీ ఇచ్చారన్నారు.

సిఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన దేశానికే ఆదర్శంగా ఉందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం ప్రజా సంకల్పయాత్రకు అరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని తట్టివారిపల్లిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహనికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకులుగా ఉన్నప్పుడు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వారికి అండగా ఉండటానికి తలపెట్టిన ప్రజా సంకల్ప యాత్ర అరేళ్లు పూర్తి చేసుకొందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల సారథిగా అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తి ప్రదాతగా సిఎం జగన్ ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సంకల్ప యాత్ర నవశకానికి పునాది పడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధల దీప వేమారెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జి అనంత మునిశేఖర్, కౌన్సిలర్లు ఎస్.వి.రమణ, వెంకట శివారెడ్డి, ఈశ్వర్ నాయక్, రామిశెట్టి శివయ్య, రేణుకమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటరమణ, నాయకులు వెలుగు చంద్ర, బెలే రెడ్డి ప్రసాద్, రఫీక్ అహ్మద్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మరమ్మతులకు నోచని మదనపల్లి రోడ్డు

గుంతలమయమైన మదనపల్లి రోడ్డు

- ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

- పట్టని అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని అరవీడు పంచాయతీ కుషాయితీనది వద్ద నుండి ఎల్లంపల్లి వరకు మదనపల్లి రోడ్డు పూర్తిగా దెబ్బ తినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడం లేదని వర్షాలు వచ్చాయంటే ఉన్న మోరీ కూడా కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈరోడ్డుపై ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలంటే భయమే స్తోందని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బి ఎఇ గిరీష్ రావు మాట్లాడుతూ గాలివీడు గేటు నుంచి రెండు లైన్ల సిసిరోడ్డు ఎల్లంపల్లి వరకు మంజూరు అయ్యిందని చెప్పారు. డబుల్ రోడ్డు పనులు చేయడానికి కాంట్రాక్టర్‌ను సంప్రదించామని చెప్పారు. డబుల్ సిసి రోడ్డు కూడా మంజూరై దని టెండర్లు పూర్తయినవెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.రోడ్డుపై గుంత లను పూడ్చి వేసేందుకు మరమ్మతులు చేపడతామన్నారు.

పరుగు పందెంలో ప్రతిభచాటిన హాసిని

ప్రజాశక్తి-కలికిరి

హాసిని

వంద మీటర్ల పరుగు పందెంలో చదివే వాళ్ళపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన హాసిని ప్రతిభ కనపరిచినట్లు ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమార్ తెలిపారు. తిరుపతిలోని తుమ్మలగుంట స్టేడియంలో జరిగిన ఎస్‌జిఎఫ్ అథ్లెటిక్స్ స్టేట్ లెవెల్ అండర్-14 ఎంపికలో కలికిరిలోని జడ్‌పి హైస్కూల్ టి.చదివేవాళ్ళపల్లిలో ఏడవ తరగతి చదువుతున్న ఈ హాసిని అండర్-14 విభాగంలో వంద మీటర్ల పరుగుపందెంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా తర పున ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని ఎంఇఒ కరీముల్లా, ప్రధానోపాధ్యాయులు సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిడుగు పడి వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పిడుగుపడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం గుర్రంకొండ మండలం మర్రిపాడులో చోటు చేసుకొంది. కుటుంబ సభ్యుల వివ రాల మేరకు.. మర్రిపాడుకు చెందిన నవాజ్ కుమారుడు మహమ్మద్‌ఆబిద్ సోమ వారం పొలంలో పశువులను మేపుకునేందుకు వెళ్లాడని చెప్పారు. సాయంత్రం పిడుగు పడడంతో మహమ్మద్ ఆబిద్‌కు తీవ్ర గాయాలయ్యాయని, హుటా హుటిన వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లికి తరలించినట్లు తెలిపారు.

సిఐను సన్మానించిన మాలమహానాడు నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సిఐను సన్మానిస్తున్న లింగం నాగేశ్వరరావు

నూతనంగా బాధ్యతలు చేపట్టిన రూరల్ సిఐ విశ్వ నాథరెడ్డిని సోమవారం మాలమహానాడు ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్య క్షులు లింగం నాగే శ్వర రావు, మండల ప్రధాన కార్యదర్శి అంబారపు కిరణ్ కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. దళిత వర్గాల ప్రజల వివాదాల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సిఐని కోరారు.

టపాసుల దుకాణాలకు 24 దరఖాస్తులు

ప్రజాశక్తి-ములకలచెరువు

తంబళ్లపల్లె నియోజకవర్గంలో ములకలచెరువు అగ్నిమాపక కేంద్రం పరిధిలో బాణాసంచా విక్రయాలకు 24 దరఖాస్తులు వచ్చినట్లు ములకల చెరువు అగ్నిమాపక కేంద్రం ఇన్‌ఛార్జి అధికారి శివప్ప తెలిపారు. ములకలచెరువు 8, పిటియం-3, బి.కొత్తకోట-5, తంబళ్లపల్లె-3, పెద్దమండ్యం-3, బురకా యలకోట-2 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండలంలో ఈ ఏడాది అత్యధికంగా బాణాసంచ విక్రయాలకు పది దుకణాలకు దరఖాస్తులు ఎక్కువ వచ్చాయి. స్థానిక క్రికెట్ గ్రౌండ్‌లో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన గుత్తి నరసింహ

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని రాజు కుంట పంచాయతీకి చెందిన గుత్తి నరసింహ తెలంగాణలో కాంగ్రెస్ పిసిసి అభ్యర్థి రేవంత్ రెడ్డిని ఆయన స్వగృ హంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రేవంత్ రెడ్డి నామినేషన్ వేస్తున్న సందర్భంగా ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పాలనతో విసుకెత్తిన జనాలు కాంగ్రెస్ పార్టీ తరపున తప్పక రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిటిడి పూజారులు, పత్తిగుంటవారిపల్లికి చెందిన మాజీ ఎంపిటిసి ఉప్పలపాటి శివప్రసాద్ రాజు స్థానికులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలకడ

మండలంలో ఖాళీగా ఉన్న రెండు వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముడియం వారిపల్లి సచివాలయ పరిధిలో ఉన్న నవాబుపేట పంచాయతీలో ఎస్‌సి పురుషులకు సంబంధించిన ఒక పోస్టు, కలకడ పంచాయితీ పరిధిలో బిసి స్త్రీలకు సంబంధించిన రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్న తెలిపారు.ఈనెల 6న నోటిఫికేషన్ జారీ చేశామని,7 నుంచి 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలించి 15, 16 తేదీలలో ఇంట ర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 18, 19వ తేదీలలో శిక్షణ తరగతులు నిర్వహించి 20న నియామక పత్రాలను అందిస్తామని చెప్పారు. **పుల్లంపేట :** మండల వ్యాప్తంగా నాలుగు వాలంటీర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎంపిడిఒ రఘురాం గారు ఒక ప్రకటనలో తెలపారు. వత్తలూరు 1, రెడ్డిపల్లి మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఈనెల 13న చివర తేదీ అని, 14న పరిశీలన, 15 , 16 ఇంటర్వ్యూలు, 20న ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తారని చెప్పారు.**తంబళ్లపల్లి :** మండలంలోని గుండ్లపల్లి గ్రామ సచివాలయం పరిధిలో దిగువ పాలెం గ్రామ వాలంటీర్ పోస్టుకు జనరల్ కేటగిరి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ సురేంద్రనాథ్ తెలిపారు. ఈనెల 13న ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.15, 16 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన అభ్యర్థికి నియామక పత్రం అందిస్తామన్నారు.

వెండి నాగాభరణం వితరణ

ప్రజాశక్తి-తంళ్లపల్లె

మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం వెండి నాగాభరణాన్ని వితరణగా ఇచ్చారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లి పంచాయతీ ఎల్ఆర్ బైలుకు చెందిన కె.మల్లికార్జుననాయుడు, ఉమాదేవి దంపతులు రూ.80 వేలు విలువ చేసే వెండి నాగాభరణాన్ని ఇఒ రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి లకు అందించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలతో ముక్కలు తీర్చుకున్నారు.

అంగన్వాడీ భవన నిర్మాణానికి గ్రహణం

ప్రజాశక్తి-కలకడ

పునాదికే పరిమితమైన అంగన్వాడీ భవన నిర్మాణం

సంబేపల్లి మండలంలోని అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి గ్రహణం పట్టింది. మండలంలోని ఎస్.సోమ వరం పంచాయతీ పరిధిలో ఉన్న అగ్రహారంలో అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి అనుమతులు మం జూరు అయినట్లు స్థానికులు తెలిపారు. ఈ భవన నిర్మాణానికి కాంట్రా క్టర్ వైఫల్యమో లేక ప్రభుత్వ వైఫల్యమో తెలియదు కానీ భవన నిర్మాణం మాత్రం నత్తన డకన సాగుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. అంగ న్వాడీ భవనం నిర్మించడానికి ప్రతిపా దనలు పంపడంతో భవనం మంజూరు కావడంతో నిధులు వచ్చినట్లు ఆ భవన నిర్మాణం పనులు చేయక పోవడంతో నిధులు సైతం వెనక్కి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో గ్రామస్తులందరూ కలిసి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను నిర్మించ డానికి స్థలం కొన్నట్లు తెలిపారు. బావులకాడపల్లె గ్రామానికి చెందిన మద్ది పట్ల రాజశేఖర్‌నాయుడు ఉదారతతో తన భూమిలో ఉన్న కొంత స్థలాన్ని పాఠశాల నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాల నిర్మించే స్థలంలో అంగన్వాడీ కేంద్రం నిర్మించడానికి సమ్మతించి నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రెండవసారి అగ్రహారంలో అంగన్వాడీ కేంద్రం నిర్మించడానికి నిధులు మంజూరు అయినట్లు, వాటితో భవన నిర్మాణం చేపట్టడానికి సంబంధిత అధికారులు చొరవ చూపినట్లు తెలిపారు. ఈ భవన నిర్మాణం గుణావర్ధానికే పరిమితమై, భవన నిర్మాణం నత్తనడకన సాగుతున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రం అద్దె భవనంలో అరకొర సౌకర్యాల మధ్య నడుస్తున్నట్లు పిల్లల తల్లిదం డ్రులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని అంగన్వాడీ భవన నిర్మాణాలను వీలైనంత త్వరగా నిర్మించి చిన్నారులకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేస్తాం

అంగన్వాడీ భవన నిర్మాణానికి రూ.13.50లక్షలు మంజూరైంది. ఆగిన అండన్వాడీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చించి పనులు పూరయ్యేలు చూస్తాం.

- ఇరగన్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ

మహిళలు ఆర్థికంగా ఎదగాలి :'గడికోట'

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-అక్కిరెడ్డిపల్లి

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి టైలరింగ్ ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని స్థానిక ఎంపిడిఒ సభాభవణంలో రూరల్ కింగ్ డమ్ డెవలప్ ఆర్గనైజేషన్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్‌ల శిక్షణ కార్యక్రమంలో భాగంగా 50 శాతం సబ్సిడీతో మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఉన్నారని, అందులో భాగంగా టైలరింగ్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న మహిళలకు ప్రభుత్వం ప్రతి ఏడాది రూ.10 వేలు నగదును మహిళల ఖాతాలల్లో వేస్తోందన్నారు. లక్కిరెడ్డిపల్లె కు చెందిన శ్రీ కనక దుర్గ లేడీస్ టైలర్స్ షాప్ వారు టైలరింగ్ పై మూడు నెలలు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు కూడా సద్వినియోగం చేసుకో వాలన్నారు. సబ్సిడీతో అందిస్తున్న కుట్టుమిషన్లను ఉపయోగించుకొని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. శిక్షణ అనంతరం కుట్టు మిషన్లు పొందిన వారికి టైలరింగ్ సర్టిఫికెట్ అందిస్తారని చెప్పారు. అనంతరం మహిళలకు సబ్సిడీ ద్వారా అందిస్తున్న కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.రూరల్ కింగ్ డమ్ డెవలప్ ఆర్గనైజేషన్ సభ్యులు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎంపిపి సుదర్శన్‌రెడ్డిని దుశ్శాలువాతో సత్కరించి మెమోం టోలు అందించారు కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఉప మండల అధ్య క్షులు సమరసింహారెడ్డి, సర్పంచులు రమణయ్య, వెంకట నారాయణ రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఎంపిటిసి సభ్యులు దస్తగిరి, జగన్మోహన్ రెడ్డి, శంకర్‌నాయుడు, ఉప సర్పంచులు రాజారెడ్డి, సంజీవరెడ్డి, రవిఆచారి, మైనార్టీ నాయకులు జాకీర్, గొరా, చాన్ బాషా, ఖాజా, బాబ్జాన్, సాహెబ్, అబ్దుల్ నబీ, సంస్థ ఆర్గనైజర్ ఛైర్మెన్ రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులను వెంటనే ఆపాలి

- జమీయత్ ఉలేమా హింద్ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-కలికిరి

శాంతియుత ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

పాలస్తీనా పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని జమయిత్ ఉలేమహింద్ ఉమ్మడి చిత్తూరు జిల్లా సెక్రెటరీ ఎండిఎం ముస్తఫా అన్నారు. పాలస్తీనా పై దాడులకు నిరసనగా సోమవారం కలికిరిలో శాంతి యుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి ప్రపంచ యుద్ధం అనంతరం బాత్ ఫోర్ డిస్ట్రన్షన్ ద్వారా పాల స్తీనాలో ప్రవేశించిన యూదులు, హిట్లర్ సాగించిన యూదుల మరణ కాండకు భయపడి ప్రపంచ దేశాల నుంచి పాలస్తీనాకు శరణార్థులుగా ఆదే శాన్నే ఆక్రమించి, ఆ దేశానికి కేవలం గాజా, వెస్ట్ బ్యాంక్ లలో 12 శాతం భ భాగాన్ని మాత్రమే మిగిల్చారని అన్నారు. ప్రస్తుతం ఇజ్రాయిల్ యుద్ధనీతికి వ్యతిరేకంగా సామన్య ప్రజల నివాసాలపై, ఆస్పత్రులు, 110 మసీదులపై, 260 స్కూళ్లపై, ఇంకా శరణార్థి శిబి రాలపై పైశాచికంగా బాంబుల వర్షం కురిపిస్తూ యుద్ధ నేరాలకు పాల్పడుతోందన్నారు. ఇప్పటి వరకు వీరి దాడి ఫలితంగా 11వేల మంది సామాన్య ప్రజలు చనిపో యారని, 35వేల మంది వరకు గాయపడ్డారని, అందులో నాలువేల మంది అమాయక పసిపిల్లలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కలికిరి జమియత్, సదర్, హాఫిజ్‌సయ్యద్ పర్వాజత్, మహబూబ్‌బాషా, కరీముల్లా పాల్గొన్నారు.

రాజన్న బాటలో జగనన్న పాలన

ప్రజాశక్తి-నందలూరు

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా రాష్ట్రంలో పాలన సాగిస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారని ఆడపూరు ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ గులాబ్ హుస్సేన్, టంగుటూరు మైనార్టీ నాయకులు షేక్ షావల్లి పేర్కొన్నారు. సోమవారం మండలం లోని ఆడపూరు గ్రామానికి చెందిన మైనార్టీలు ఇడుపుల పాయలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమా ధిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్.రాజ శేఖర్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశార న్నారు. అదే స్ఫూర్తితో ఆయన కుమారుడు సీఎం జగన్ మరింత చేరువగా వాలంటీర్లను, సచివాలయలను ఏర్పాటు చేసి మంచి పాలన కొనసాగి స్తున్నారని అన్నారు. 2024 ఎన్నికలలో మళ్లీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రి కావాలని ప్రార్థనలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో షేక్ అక్బర్, షేక్ అబ్దుల్ లతీఫ్, షేక్ ఇబ్రహీం, షేక్ అహ్మద్, షేక్ కలీం, హరి, షేక్ లిల్లీ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని చౌడ సముద్రం గ్రామం ఎస్‌సి కాలనీలో నివాసమున్న వెంకటరమణ(70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. వీరి బాగోగులు చూసుకోవడానికి కుటుంబ సభ్యులు ఎవరు ముందుకు రాకపోవడంతో స్థానికులుజనసేన పార్టీ మండల కన్వీనర్ సాయినాథ్ కి తెలిపారు. వీరి కుటుంబానికి ఐదు నెలలుగా నిత్యవసర సరుకులు జనసేన పార్టీ ములకలచెరువు మండల అధ్యక్షుడు పోతుల సాయినాథ్ అందించేవారు. వెంకటరమణ మరణించిన విషయం తెలుసుకున్న సాయినాథ్ అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గుమ్మిశెట్టి గోపాలకృష్ణ, ఎంఆర్‌పిఎస్ నాయకులు తిరుపాల, శివ, శివకుమార్ పాల్గొన్నారు.

సిఎం కక్ష పెంచుకోవడం బాధాకరం

ప్రజాశక్తి - చక్రాయపేట

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సొంత జిల్లాపై కక్ష పెంచుకోవడం చాలా బాధాకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న కరువు పరిస్థితిని సోమవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్రంపై కసి, జిల్లాపై కక్ష, సొంత నియోజకవర్గమైన పులివెందులపై పగ పెంచుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని 18 జిల్లాలోని 449 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే కంటి తుడుపు చర్యగా కేవలం 7 జిల్లాలో 103 మండలాలను మాత్రమే కరువుగా ప్రకటించడం శోచనీయమన్నారు. కడప జిల్లాలో 35 మండలాల్లో కరువు రక్కసి ఉండగా ఒక మండలాన్ని కూడా కరువు మండ లంగా ప్రకటించక పోవడం దారుణమన్నారు. గోపవరం మండలంలో 72.20 శాతం తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ దాన్ని కూడా కరువుగా ప్రకటించలేదన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని 7 మండలాల్లో కరువు తీవ్రంగా ఉందన్నారు. కానీ ఒక్క మండలాన్ని కరువు మండలంగా ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, కరువు సహాయక చర్యలను చేపట్టాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధృవవకుమార్‌రెడ్డి, బాలం సుబ్బరాయుడు, ఉత్తన్న, అమర్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మూడవ పట్టణ సిఐ వెంకటరమణ సూచించారు. మంచి అలవాట్లు పెంచుకోవాలని సోమవారం స్థానిక బడ్డాయపల్లిలో ఉన్న దీప్తి కళాశాలలో విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన యాంటీ డ్రగ్స్, యాంటీ రాగ్గింగ్, దిశ యాప్, ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ గురించి అవగాహన కల్పించారు. కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దిశ యాప్ సమాజంలోని ప్రతి ఒక్కరూ వారి వారి స్మార్ట్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దీన్ని అత్యవర పరిస్థితుల్లో ఉపయోగించాలని ఆయన కోరారు. ఇల్లు వదిలి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా పోలీస్ సేవలు వాడుకోవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు రోజురోజుకూ మెరుగవుతున్నాయని, వీటిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి కోరారు. స్థానిక ప్రభు త్వాసుపత్రిలో రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన బాలభవిత కేంద్రాన్ని సోమ వారం ఆయన ప్రారం భించారు. అనం తరం ఎమ్మెల్యే మాట్లా డుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్యాన్ని కాపాడే విషయంలో మంచి ప్రగతి సాధిస్తున్నామన్నారు. నాలుగురోజుల క్రితం రక్తపరీక్షలో మెరుగైన సేవలు అందించేందుకు ల్యాబ్‌ను ప్రారంభిం చామన్నారు. 0 నుండి 18 సంవత్సరాల వయసు వరకు పిల్లల భవిష్య త్తుకు ఎంతో ఉపయోగపడే బాలభవిత కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఈ కేంద్రంలో పిల్లల మానసిక, శారీరక రుగ్మతలకు చికిత్స ఉంటుందన్నారు. ముందుగా 'ప్రజాసంకల్పయాత్ర' పేరుతో జగన్ పాద యాత్ర పూర్తి 6 సంవ త్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని వైయస్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి, కమాల్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగశేషారెడ్డి, జింకా విజయలక్ష్మి, కొండ ధనలక్ష్మి, మల్లికార్జున్‌రెడ్డి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావాలి

పులివెందుల టౌన్ : ప్రజలతో మమేకమై అధికారులు ఉండాలని మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ పరిపాలన కార్యదర్శులు, నోడల్ అధికా రుల తో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ పథకంలో వాలంటరీ ద్వారా ఇకెవైసి చేయించాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ అర్హులైన వారికి అవి అందేలా చూడా లన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయ పరి పాలన కార్యదర్శులు, నోడల్ అధికా రులు , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

8న విద్యా సంస్థల బంద్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేట్ పరం చేయొద్దని ఈనెల 8న జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దస్తగిరి పిలుపినిచ్చారు. **చాపాడు :** కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాలని విశాఖ ఉక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా కేజీ నుండి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దు రాహుల్ కోరారు. సోమవారం మైదుకూరులో ఆయన మాట్లాడుతూ మూడు శంకుస్థాపనలు, నాలుగు పునాదులు వేశారు కానీ కడప ఉక్కు పరిస్థితి అలాగే ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు అభిరామ్, పవన్ పాల్గొన్నారు. **బ్రహ్మంగారిమఠం :** కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న జరిగే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలన్నారు.

వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని పాత మొలకలచెరువు పంచాయతీ పాత ములకలచెరువు గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ఉన్న నీటి తొట్టెలో పంచాయతీ నీరు వృథాగా పోతోంది. ప్రతి నిత్యం రోడ్డు పక్కన ఉన్న పంచాయతీ నీరు తొట్టె నిండి నీరు వృధా పోవడంతో పరిసరాలు బురదమయంగా మారాయి. దోమల బెడద ఎక్కువై ఆ దారి గుండా వెళ్లే ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బంది పడుతున్నారు. నీటి తొట్టెలో పాచి పేరు పోవడంతో జంతువులు తాగడానికి కూడా నీరు ఉపయోగకరంగా లేక దోమల బెడదతో రోగాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థుల కోసమైనా మురుగు నీరు నిల్వ ఉండగా పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వైసిపి బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఈనెల 10న నియోజకవర్గంలో జరిగే ప్రజా సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు పెద్దపీట వేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ తలపెట్టిన సామాజిక సాధికార యాత్ర 10న పిటిఎం నుంచి ప్రారంభమై బి.కొత్తకోట మీదుగా ములకలచెరువు వరకు బస్సు యాత్ర జరుగుతుందన్నారు. అనంతరం ములకలచెరువులో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు,పెద్దిరెడ్డి కుటుంబ అభిమానులు పాల్గొనాలని కోరారు.

క్రైం కార్నర్

నిందితుడి అరెస్టు చూపుతున్న సిఐ మంజునాథ్‌రెడ్డి

మోటర్ల దొంగ అరెస్టు

ప్రజాశక్తి-నందలూరు

మండల పరిధిలోని నిర్మాణంలో ఉన్న గృహాలు, ఇళ్ల వద్ద ఉన్న వాటర్ మోటర్లను దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి ఆరు మోటర్లు స్వాధీనపరుచుకున్నట్లు రాజంపేట రూరల్ సిఐ మంజునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సిఐ ఆదేశాల మేరకు ఎస్ఐ అబ్దుల్ జహీర్ తన సిబ్బందితో కలిసి నందలూరు మండల పరిసర ప్రాంతాల్లో ఉదయం పది గంటలకు ఆల్విన్ ఫ్యాక్టరీ సమీపంలోని బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న షేక్ మస్తాన్ అరెస్టు చేసి విచారించినట్లు తెలిపారు. అతని వద్ద నుండి ఆరు మోటర్లు స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. మోటారు దొంగతనాలకు పాల్పడిన షేక్ మస్తాన్ గతంలో రాయచోటి పరిధిలోని కొత్తపల్లి నివాసముండేవాడని ప్రస్తుతం రాజం పేట మండల పరిధిలోని బోయనపల్లె గ్రామంలో నివాసముంటున్నాడని తెలిపారు. అతని వద్ద నుచి రూ.75వేలు విలువ గల ఆరు మోటార్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శంకర్‌నాయక్, రాయుడు, పోలీసు సిబ్బంది మహేంద్ర, వర్మ, దర్బార్, రామ కృష్ణ పాల్గొన్నారు.

కారు బోల్తా : బాలుడు మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని సీతారాంపేట వద్ద సోమవారం తెల్లవారు జామున కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల మేరకు.. తిరుమల నుంచి నంద్యాలకు తిరుగు ప్రయా ణంలో తెల్లవారుజామున రెండు గంటల సమయంలో సీతారాంపేట వద్ద కారు అదు పుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నంద్యాలకు చెందిన నిశాంత్(8) అనే బాలుడు తీవ్రంగా గాయ పడటంతో తిరుపతి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని చెప్పారు. ఆ ఘటనలో మరో ఇద్దరు గాయపడ్డారని చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-కలకడ

నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు, సారా ఊటను ధ్వంసం చేశామని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మండ లంలోని దిగుతాండ పంచాయతీ దిగుతాండ సమీపంలో ఉన్న దామరగుట్ట వద్ద నాటుసారా తయారు చేస్తున్నట్లు ముందస్తు సమాచారం అందినట్లు ఎస్ఐ తెలి పారు.ఈ సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. మండల పరిధిలోని దిగుతాండాకు చెందిన బుక్కే వెంకటరమణనాయక్ నాటుసారా తయారు చేస్తున్నట్లు గుర్తించి, నాటు సారా తయారు చేస్తున్న బట్టీలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. వెంకటరమణ నాయక్‌ను అదుపులోకి తీసుకొని 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అతనిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ దాడులలో హెడ్ కానిస్టేబుల్ హరిబాబు, ప్రతాప్, డ్రైవర్ రమేష్ బాబు పాల్గొన్నట్లు తెలిపారు. **నిమ్మనపల్లి :** నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపి నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..మండలంలోని రాచవేటివారిపల్లి గ్రామంకు సమీపంలో రాజు అనే వ్యక్తి నాటుసారాను తీసుకు వచ్చి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. ఆ సమాచారం మేరకు సోమవారం నాటు సారా విక్రయ స్థావరం పై పోలీసులు దాడి చేసి రాజు ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. నాటుసారా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ : నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు